ఇరుకు దారులు.. కదలని వాహనాలు

- యథేచ్ఛగా రహదారులను ఆక్రమించి అద్దెలకిస్తూ
- దృష్టి సారించని అధికారులు

పొన్నూరు: మున్సిపాలిటీ పరిధిలో రోజు రోజుకు వాహనాల రద్దీ పెరిగిపోతోంది. దుకాణాల ముందు రహదారుల ఆక్రమణ, వాహనాల పార్కింగ్‌తో ఇరుకుగా మారిన రోడ్లపై భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ వాహనాలు నిర్దిష్ట సమయంలోనే తిరగాల్సి ఉండగా ఎడాపెడా నడుస్తుండటంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఫలితంగా ఇరుకు దారుల్లో లారీలు మలుపులు తిప్పే సమయంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

■ పట్టణ పరిధిలో ప్రధాన వ్యాపార కూడళ్లైన ఐలాండ్ సెంటర్, ఎస్సీపీ రోడ్డు, కసుకర్రు రోడ్డులో నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్లలో నడక సాగించాలంటే అవస్థలు పడాల్సిన పరిస్థితి. దుకాణాల ముందు భాగాలను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడమే కాకుండా ద్విచక్ర వాహనాలు కూడా రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సాయంత్రం 5 గంటల నుంచి ఆ రోడ్లలో వెళ్లాలంటే ప్రజలు నరక యాతన పడుతున్నారు.

■ మున్సిపల్ కమిషనర్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో ఆక్రమణలపై దృష్టి సారించారు. దుకాణాల ముందు పది అడుగుల స్థలం వరకు ఎలాంటి వ్యాపారాలు నిర్వహించకూడదనే నిబంధనను విధించారు. కాలక్రమేణా ఆ నిబంధన అటకెక్కింది. మళ్లీ ఆక్రమణలు జోరందుకున్నాయి.



ఎస్సీపీ రోడ్డులో నిలిచిన విహనాలు



ఆక్రమణలపై వ్యాపారులకు సూచిస్తున్న మున్సిపల్ అధికారులు(ఫైల్)



ఇరుకు దారుల్లో మలుపు తిప్పుతున్న భారీ వాహనాలు

■ ఎస్సీపీ రోడ్డుకు అనుబంధంగా ఉండే మార్గాల్లో రాకపోకలు సాగించాలంటే ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా మున్సిపల్ కాంప్లెక్స్ వెనుక రహదారుల్లో ఎక్కడపడితే అక్కడ ద్విచక్ర వాహనాలు నిలిపి వేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఆక్రమించి అద్దెలకిస్తూ

అసలే ఇరుకైన రహదారులతో ప్రజలు సతమతమవుతుంటే, ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న నడకదారులను ఆక్రమించి అద్దెకి ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఐలాండ్ సెంటర్‌లోని రద్దీ ప్రాంతాలు పూర్తిస్థాయిలో ఆక్రమణలకు గురయ్యాయి. ఆర్టీసీ బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ఆక్రమణల కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే దుకాణాలకు సంబంధించిన బోర్డులు, కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసి ఇరుకైన రహదారులుగా మారుస్తున్నారు. వారిది కాని స్థలాలను సైతం ఆక్రమించి అద్దెలకు ఇచ్చి రూ.వేలల్లో అద్దెలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

■ ఇటీవల రహదారుల విస్తరణకు మున్సిపల్ అధికారులు కార్యరూపం దాల్చారు. చేపట్టిన కార్యాన్ని పూర్తిస్థాయిలో చేయకుండా మట్టి తరలింపుతోనే సరిపెట్టారని అధికారుల పనితీరు పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో ఆక్రమణల కారణంగా తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారం



పొన్నూరు: మధ్యవర్తిత్వం ద్వారా జాతీయ లోక్ అదాలత్‌లో ఎలాంటి కేసులనైనా పరిష్కరించుకోవచ్చునని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ న్యాయమూర్తి పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం పొన్నూరు సివిల్ జడ్జి కోర్టులో మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడే కేసులను పరిష్కరించుకోవాలని న్యాయవాదులకు, పారా లీగల్ వలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు మక్బుల్ బేగ్, షేక్ బాజీ సాహెబ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పొందుగుల జయరాజ్, పిల్లి విజయ్‌కుమార్, మల్లెల ఈరేస్, వర్ధన్, అంకమ్మరావు, సదానందరావు, బి.ప్రకాశరావు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేసుకోవాలి

ఏఓ వెంకట్రామయ్య



పొన్నూరు: మండలంలోని దండమూడి, మునిపల్లె గ్రామాలలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర, వరి పంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏఓ డేగల వెంకట్రామయ్య మాట్లాడుతూ మొక్కజొన్న, జొన్నలో కాండం తొలుచు పురుగు సస్యరక్షణ చర్యలు వివరించారు. మినుము, పెసర పంటలలో ముఖ్యమైన పోషకాలు పిచికారీ రూపంలో అందించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని తెలియజేశారు. రబీ సీజన్‌లో వేసిన అన్ని పంటలకు ఈ పంట నమోదు చేసుకోవాలని, ఈ కేవైసీ కూడా తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది అరుణ నాగరాజా, రైతులు పాల్గొన్నారు.

రేపు లింగంగుంట్లలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం లింగంగుంట్లలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ తెలిపారు. సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ, న్యూరో సర్జన్ డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, సీనియర్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ విజయబాబు ఆధ్వర్యంలో కంటి, మెదడు వ్యాధులకు పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మెదడు, నరాల సమస్యలు, పక్షవాతం, తలనొప్పి, తూలుడు, ఫిట్స్, చిన్న వయస్సులో వచ్చే నరాల సమస్యలు, నడుము నొప్పి, వెన్ను నొప్పి, న్యూరోపతి సమస్యలు, కంటి శుక్లాలు ఉన్నవారు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని ఆయన సూచించారు. అవసరమైన వారికి, కంటి శుక్లాలు ఉన్నవారికి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా లలితా హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్ చేస్తారని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు



నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ 6వ లైనులో అయిశెట్టి సీతారామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంబరాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భారీ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ అయిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రంగనాయకి, గోదాదేవి సహిత రంగనాథస్వామి విగ్రహం ఊరేగింపు అనంతరం లడ్డూ వేలం పాట ఉంటుందని చెప్పారు.

న్యాయవాదిపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



పొన్నూరు: పట్టణానికి చెందిన న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై ఉద్దేశ పూర్వకంగా దాడి చేసిన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో అంబటి మురళీకృష్ణ పాల్గొని మాట్లాడారు. న్యాయవాది ప్రకాశరావుపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలన్నారు. న్యాయవాదిపై జరిగిన దాడిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని న్యాయవాదికి తగు న్యాయం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, డాక్టర్. రూత్ రాణి తదితరులు పాల్గొన్నారు.

మంచానికే పరిమితమైన వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



కాకుమాను: మంచానికే పరిమితమైన వారి ఆరోగ్యం పట్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి.లావణ్య అన్నారు. జిల్లా వైద్య శాఖ ఆదేశాల మేరకు పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మంచానికే పరిమితమైన వారి ఆరోగ్య విషయాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 40 మంది మంచానికే పరిమితమైన వారు ఉన్నట్లు తెలిపారు. కుటంబ సభ్యులు వారి ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే సంబంధిత ఏఎన్ఎంకు గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు వస్తే ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలు అందించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు, విజయవాడ జిల్లా ఆరోగ్య కేంద్రాల ప్రొఫెసర్లు డాక్టర్ బి.ఎస్.రవితేజ, డాక్టర్ ఎన్.సింధూర, సీహెచ్‌ఓ ప్రసాద స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగుపై అప్రమత్తంగా ఉండాలి

ఏఓ కిరణ్మయి



చినలింగాయపాలెం(కాకుమాను): రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు పంటపై కత్తెర పురుగు ఆశించకుండా అప్రమత్తంగా ఉండాలని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని చినలింగాయపాలెం, కొండబాలబవారి పాలెం గ్రామాలలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మొక్కజొన్నపై అక్కడక్కడ కత్తెర పురుగు కనిపిస్తున్నట్లు ఆమె తెలిపారు. పంటపై ఈ రకం పురుగు ఆశించిన వెంటనే ఉదయాన్నే మంచు కురిసే సమయంలో ఎకరాకు 150 మిల్లీ లీటర్ల ఇమామెక్టిన్ బెంజోడ్, 150 మిల్లీ లీటర్ల నవల్యూరాన్ రెండు మందులను నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. రైతులందరు తప్పనిసరిగా పంట నమోదు, ఈ కేవైసీ చేయించుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్'ను విజయవంతం చేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెలా 3వ శనివారం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్‌ను విజయవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నోడల్ అధికారులను ఆదేశించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కలిగించాలని ఆయన తెలిపారు. కార్యక్రమాలకు ప్రోటోకాల్ మేరకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని చెప్పారు. శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమాల నిర్వహణపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేశంలో అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడానికి 12 నెలలకు 12 థీమ్‌లతో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రూపొందించారని తెలిపారు. అందులో భాగంగా శనివారం న్యూ ఇయర్ – క్లీన్ స్టార్ట్ థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేశామని చెప్పారు. శనివారం జిల్లా కలెక్టరేట్ నుంచి హిందూ కాలేజీ సిగ్నల్ జంక్షన్ వరకు స్వచ్ఛత ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ చేపడతామని వివరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సలహాలు అవసరం

నగరాభివృద్ధికి సీనియర్ సిటిజన్స్ సూచనలు, సలహాలు ఎంతో దోహదపడతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సీనియర్ సిటిజన్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ వివిధ రంగాలలో ఎంతో అనుభవం సాధించి ఉంటారని, వారి సూచనలు, సలహాలు నగరాభివృద్ధికి ఎంతగానో అవసరమని తెలిపారు.

సీనియర్ సిటిజన్స్, నగరపాలక సంస్థ అధికారులతో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని, అందులో అభిప్రాయాల్ని పోస్ట్ చేయవచ్చని తెలిపారు. నగరంలో ప్రధానంగా వార్డు అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయాలని, సుదీర్ఘ కాలం నుంచి అసంపూర్తిగా ఉన్న నార్ల ఆడిటోరియం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ కమిషనర్‌కు సూచించారు. గోరంట్ల కొండపై రిజర్వాయర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, తాగు నీటి రిజర్వాయర్ల వద్ద వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. శంకర విలాస్ వద్ద ఆర్ఓబీ నిర్మాణ పనులు ప్రారంభానికి ముందే రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని తెలిపారు.

మతోన్మాద శక్తులను ప్రతిఘటించాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

లక్ష్మీపురం: రాష్ట్రంలో మతోన్మాద శక్తులు పాగా వేసే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండి ప్రతిఘటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామారావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిత్యావసరాలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశన్నంటుతున్నాయని ఆరోపించారు. సాధారణ ప్రజలకు ఉపాధి తగిన విధంగా లేదని, పేదలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జమిలీ ఎన్నికల పేరుతో భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తూ, రాష్ట్రాల హక్కులను కాలరాసే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పేదలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, అర్హులైన పేదలకు స్థలాలిచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ. 5లక్షలు కేటాయించాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎన్ భావన్నారాయణ, కె.నళినికాంత్, ఎం.రవి, బూరగ వెంకటేశ్వర్లు, ఎల్.అరుణ, యస్.యస్.చెంగయ్య, జవహర్‌లాల్, పి.కృష్ణ, ఎం.ఎ.చిష్టి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడిని పరామర్శించిన అంబటి మురళీకృష్ణ



తోట శ్రీనివాసరావు మాతృమూర్తిని పరిమర్శిస్తున్న అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోట శ్రీనివాసరావు మాతృమూర్తి ఇటీవల అనారోగ్యం పాలైంది. ఈ విషయం తెలుసుకున్న పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, గుంటూరు నగర పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు)లు శుక్రవారం పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామానికి చేరుకుని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా ఏటీఎం

చేబ్రోలులో పది రోజులుగా పనిచేయని ఎస్‌బీఐ ఏటీఎం



చేబ్రోలులో పనిచేయని ఎస్‌బీఐ ఏటీఎం మిషన్లు

చేబ్రోలు: ఏటీఎంలు ఉన్నా ఉపయోగం సున్నా అన్న చందంగా తయారైంది మండల కేంద్రమైన చేబ్రోలులో పరిస్థితి. చేబ్రోలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఏటీఎం తరచూ మొరాయిస్తూ ఖాతాదారులకు చుక్కలు చూపిస్తుంది. ఏటీఎం ఉన్నా ఉపయోగం లేకపోవటంతో మండల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ఏటీఎంలు ఏ రోజు పని చేస్తాయో, ఏ రోజు పనిచేయవో తెలియక వినియోగదారులు తికమక పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నగదు డ్రా చేసుకునేందుకు వచ్చిన వారు నిరాశతో తిరిగి వెళ్తున్నారు. చేబ్రోలులోని జీబీసీ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఏటీఎం సంక్రాంతి పండగ రోజున అవసరాలు కోసం డబ్బులు డ్రా చేసుకోవటానికి వచ్చిన ఖాతాదారులు ఏటీఎం పనిచేయకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనిచేయని మిషన్లు ఎందుకు పెట్టారంటూ బ్యాంక్ అధికారులను తిట్టి పోస్తున్నారు. కొందరైతే ఏకంగా బ్యాంక్ అధికారులను శాపనార్థాలు పెడుతున్నారు. ఏటీఎంలు పనిచేయడం లేదన్న విషయాన్ని బ్యాంక్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకోవటం లేదంటూ ఖాతాదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో నగదు అత్యవసరమైన వారు జిల్లా కేంద్రమైన గుంటూరు, లేక పొన్నూరు, తెనాలి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. నగదు అత్యవసరమైన ఖాతాదారులు స్థానికంగా ఉన్న కొంత మంది కమిషన్ వ్యాపారుల వద్దకు వెళ్లి వెయ్యికి రూ.30 నుంచి రూ.50 వరకు కమిషన్ చెల్లించి నగదు తీసుకోవటం లేక వారి ఫోన్ పేలో ట్రాన్స్‌ఫర్ చేయించుకోవటం జరుగుతుందని చెబుతున్నారు.

నెలలో పది రోజులు కూడా పనిచేయటం లేదు

చేబ్రోలులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం అలంకార ప్రాయంగా మారింది. గత పది రోజులుగా ఏటీఎం మరమ్మతులకు గురయి నిరుపయోగంగా ఉంది. పనిచేయని ఏటీఎం ఖాతాదారులకు నరకం చూపిస్తుంది. నెలలో పది రోజులు కూడా ఇక్కడ ఏటీఎం పనిచేయటం లేదు. బ్యాంకుల వద్ద ప్రజలు పడిగాపులు కాసే పని లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏటీఎంలు ఏర్పాటు చేసినప్పటికి అవి అలంకార ప్రాయంగా మారాయి. ఏటీఎం కార్డులు ఉన్న ఖాతాదారుల నుంచి బ్యాంకులు సేవ రుసుం వసూలు చేస్తున్నప్పటికీ ఏటీఎంలు 24 గంటలు సక్రమంగా పనిచేసిన దాఖలాలు ఎక్కడా కానరావడం లేదు. ఏటీఎంలకు మరమ్మతులు చేపట్టి సక్రమంగా పనిచేసేలా చూడటంతో పాటు ఏటీఎంలో నగదు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని మండలంలోని బ్యాంక్ ఖాతాదారులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీగా పీడీఎఫ్ అభ్యర్థినే ఎన్నుకోవాలి



ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: రాజకీయాలకు అతీతంగా ప్రజల పక్షాన నిలిచి, శాసనమండలి వేదికగా సమస్యలపై గళం వినిపించగల పీడీఎఫ్ అభ్యర్థినే ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని యూటీఎఫ్ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహన్‌రావు, జె.వినయ్, ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం కృష్ణా–గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావును తిరిగి గెలిపించుకోవాలని కోరుతూ ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చిలో జరగనున్న ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో నిరుద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాలు బలపర్చిన అభ్యర్థి విజయం ప్రజాస్వామ్య పరిరక్షణకు కీలకమని తెలిపారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫోరం (పీడీఎఫ్) తరపున ఎమ్మెల్సీగా గెలిచిన తాము ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, నిరుద్యోగులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల హక్కుల పరిరక్షణ, సాధన కోసం శాసనమండలిలో గళం విన్పించగల సామర్థ్యం పీడీఎఫ్ అభ్యర్థులకు ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గుంటూరు జిల్లా సహాధ్యక్షురాలు వై. నాగమణి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

వాసిమళ్ల శేఖర్, వాసిమళ్ల సత్యనాథ రావు, అడ్వకేట్స్
రావిపాటివారి పాలెం, ప్రత్తిపాడు(మం), గుంటూరు జిల్లా. సెల్: 9908250805

రోడ్డు భద్రత నియమాలతో ప్రమాదాలకు చెక్

ఆర్టీఓ బి.సత్యనారాయణ ప్రసాద్

పట్నంబజారు: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆర్టీఓ బి.సత్యనారాయణ ప్రసాద్ చెప్పారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో సత్యనారాయణప్రసాద్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరికీ ఏకాగ్రత ఎంతో ముఖ్యమని తెలిపారు. మద్యం తాగడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మలుపు వద్ద అతివేగం ప్రమాదాలకు కారణమవుతాయన్న విషయం గుర్తించాలని చెప్పారు. సర్వీసు రోడ్లను వాహనదారులు పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉండదని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు సీనియర్ల ద్వారా డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మానవ తప్పిదాల కారణంగానే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీఏ కార్యాలయంలో..

స్వర్ణభారతీనగర్‌లోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ఆర్టీవో బి.సత్యనారాయణప్రసాద్, ఎంవీఐలు బి.గోపాల్, మల్లేశ్వరి, సౌజన్య, ఏఎంవీఐ సంధ్య రక్షణ గురించి వివరించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణానికి రక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవోలు, అధికారులు పాల్గొన్నారు.



ఆర్టీవో సత్యనారాయణ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆర్ఎం రవికాంత్

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో మాట్లాడుతున్న సీపీఐ నేతలు

లక్ష్మీపురం: ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. గుంటూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి సహకారంతో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక శారదా కాలనీ మామిళ్లపల్లి మాలకొండయ్య స్థూపం వద్ద నిర్వహించిన శిబిరంలో వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. సీపీఐ 48వ డివిజన్ కార్యదర్శి ఇరిగినేని వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, నగర కార్యదర్శి మాల్యాద్రి, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు అరుణ్‌కుమార్, అంజిబాబు, మరియదాసు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, 51వ డివిజన్ సీపీఐ కార్యదర్శి రవి పాల్గొన్నారు.